మా ఆవిడ భక్తి

ఈమధ్య భజనల హడావుడి ఎక్కువైంది. ఇంటింటా భజనలు బయలుదేరినవి. మా ప్రాంతాల రామభజనలు ఆగి పోయి పాండురంగ భజనలు విరివిగా కొన్నాళ్లు సాగి ఇప్పుడువికూడా అంతరించినవి. ఈ భజనల విషయం కూడా అదో గాలిపాట. స్థానిక ప్రభుత్వాధికారులవలె, ఈదేవుళ్లూ భజనలుపొందే అధికారం కొంతకాలానికి పోగొట్టుకొంటూరు.

పాండురంగ విఠల్ భజనలు వెనుకబడే సమయానికి కాకినాడనుంచి ఒక్కకుటుంబం వచ్చింది. ఒకసామాన్య వాక్యం లాగా ఒక చిన్న సామాన్య కుటుంబం అదీనూ ఇద్దరితో మాత్రం కూడుకున్నది కర్త క్రియ మాత్రమే కర్మలేదు.

వాళ్లు వచ్చి హరనాథ్ బాబు భజనలు ప్రారంభించారు. ఈభజనలు చూడడానికి జనం విరగబడ్డారు. కాకినాడనుంచి వచ్చిన ఆకుటుంబంలో ఆముసలి ఆవిడే భక్తురాలు. దబ్బపండులాంటి ముత్తయిదువ. ఆమె పరమ భక్తురాలులాగ కన బడుతుంది. భజనలు జరిపేది ఆమెగారే! ఆమెభర్త చద్ది అన్నంతిని అంచక్కా వీధిఅరుగుపైన కూర్చుని చుట్టకాలుస్తూఉంటాడు. జహంగీరు చక్రవర్తి రాజ్యకార్య నిర్వహణ

సారమంతా సూర్యహాన్ కు వదలి వేసి "నాకు ఓ మాంసపు ముక్కా, ఓడొక్కు సారాయి ఇస్తే చాలు" అన్నాడట! ఈ ఉపాసకుడి ఆదేవరుస.

ఆభక్తురాలుమట్టుకు తన్మయత్వంపొంది అనిర్వచనీయమైన భక్తి లో మునిగిపోతుంది. భక్తురాండ్రు కూడా ఆకానేప్పూ, ఆనందంలో చిందులాడుతారు.

భజనకు ప్రారంభంలోనే, ఆవిడ, హరినాథ బాబా పటం అక్కడ పెట్టేసి, దానిముందు వెన్న పాలూ అరటిపండ్లూ అప్పాలూ మొదలైనవి ఆరగింపుకై ఉంచుతుంది. అక్కడ నుంచి అఖండమైన భజనానంతరం ఆవస్తువులలో ఏదో ఒక టిజయము ఆరగించిపోవటం. ఇది జరుగుతున్నపని.

బాబా ఆరగించిపోవటం అంటే, ఏదో ఒక వస్తువు అక్కడనుంచి మాయమైపోవటమే. భగవంతుడు బాబా అవతారంలో, ఇల్లాగ పదిమందిలోకీ వచ్చి ప్రత్యక్షంగా భక్తులుఉంచిన ప్రసాదాన్ని ఆరగించి పోవటం బహుచిత్రం అవటంమూలాన జనం విరగ బడటం సాగించారు. ఆమె మరీ ఉత్సాహంతో భజనలు సాగించింది.

కొందరు ఆమెను అనుమానించారు, ఏమన్నా మాయ చేస్తున్నదేమోనని. ఆమె, కొందరు స్త్రీలను ఒకప్రత్యేకమైన గదిలోకి పిలిచి, వివస్త్రురాలై ఎక్కడా ఏమీ దాచిపెట్టలేదని రుజువు ఇచ్చింది. ఆపళంగా, అందరికీ నమ్మకం కలిగింది. నిజంగా హరినాథబాబే, ఈవస్తువులు ఎత్తుకొనిపోయి భ

జిస్తున్నాడని.
ఆమె.. అక్కడ ఆవస్తువులు పెడుతుంది...దూరంగాకూర్చుని భజనచేస్తుందీ, నీకళ్లు ఆవస్తువులమీదనే ఉంచు నీకు నమ్మకంలేకపోతే, భజన పూర్తి అయ్యేటప్పటికి చూడూ ఏదో ఒకటి ఆయన ఎత్తుకొనిపోయి ఉంటాడు. ఇదేమిటి ? గారడీకాదు మాయకాదు. మంత్రంగాదు తంత్రంగాదు నిజంగా జరుగుతూఉన్న విషయం.

భగవంతుడు ఈముసలమ్మ భక్తికిమెచ్చి వస్తున్నాడా ? సనకసనందనాద మహామునులు, వాల్మీకాది భక్తులు సంవత్సరాంతరబడి నిద్రాహారాలులేక తపస్సుచేసినా అనుగ్రహించని భగవానుడు ఈ లంకపొగాకు చుట్టలు తగలేసే ఆయన భార్యకు, కనిపిస్తున్నాడా అనికొందరునాస్తికులు అన్నారు. అంతే మట్టుకు ఆమాటలకు విలువలేకపోయింది.

హరినాథ్ బాబా స్పిరిట్ వచ్చి ఇల్లాగ చేస్తున్నదనీ స్వర్గీయమైన ఆత్మలు ఇల్లాగ వచ్చి, మనతో మాట్లాడటం మొదలైన పనులు ఇప్పుడు జరుగుతున్నవనీ, పశ్చిమ దేశాలలో ఈ విషయమై కొంత పరిశోధన జరుగుతున్న విషయము నేను చదివాననీ, మా ఆవిడతో చెప్పాను. అంతట ఆవిడకు ఈ విషయంలో మరీ నమ్మకం ఏర్పడింది.

ప్రతి శుక్రవారం తీరికచేసుకొని, మా ఆవిడకూడా ఈ భజనలకు వెళ్ళేది. ఒకరోజున అరటిపండ్లూ, ఇంకోరోజున వెన్నా, ఇంకోరోజునపాలూ, ఇల్లాగ ప్రతిమారూ ఏదో ఒకటి అంతర్థా

నమ్మై పోతూవచ్చింది. ఆవిడకు హరనాథ్ బాబులో నమ్మకం కూడా హెచ్చుఅయింది. ప్రత్యక్షంగా కళ్ల ఎదట పరిమంగాను జరుగుతున్న విషయాన్ని గురించి నమ్మకం కలగకుండా ఎల్లా ఉంటుంది?

౨

కొన్నాళ్ళు జరిగిన తరువాత భజనచేసే వాళ్ళల్లోనే కొందరు ఆమెను సమీపించి మీరు చేస్తేనే ఇల్లాగ జరుగుతుందా? మేము భజనచేసినా ఆరగింపు చేస్తాడా అని అడిగారు.

మీ పూర్వజన్మ సుకృతంమీద ఆధారపడియున్న విషయం అది. ఎట్లా చెప్పగలము. సంచితం ఏమీ లేకపోతే ఆయన కరుణిస్తాడు. అని ఏమేమో వేదాంత వాక్యాలు నాలుగు నాగ దీసి చెప్పేసి, అయినా ప్రయత్నంచేయండి. భక్తితో సాధించరాని దేముంది? భక్తివలన మీ సంచితకర్మ నశిస్తుంది, భగవదాదరణా కలుగుతుంది ఆమటా అని ఆవిడగారు చెప్పింది.

తరువాత కొందరు హరనాథబాబా భజన ప్రారంభించారు. మొదట్లో, ఎవ్వరింట్లోనూ, ఏమీ ఆరగింపు కాలేదు.

ఈ విషయం ఆవిడతో చెప్పుకొంటే ఆవిడ "మీరు ఇంకా తీవ్రభక్తితో భజనచేయండి. బాబా కరుణామయుడు. తప్పక మీ గృహాన్ని పావనం చేస్తాడు" అని హితం చెప్పి పంపింది.

చాలామంది విశ్వాసంతో భజనలు అల్లాగే చేశారు మాన కుండా. నాలుగైదువారాలు గడచినా దయకలుగలేదు బాబా

కు. ఆ భక్తురాలు ఒక్కొక్క వారం ఒక్కొక్క ఇంటికి వెళ్ళి భజనలు జయప్రదంగా సాగించింది. ఆవిడ సాన్నిధ్యంలో మాత్రం ఆరగింపు అవుతుండేది. ఆవిడ పరోక్షంలో మాత్రం ఎక్కడపెట్టిన వస్తువులు అక్కడే ఉండేవి. కాని ఆవిడ ప్రోత్సాహం వల్ల ఆయనకు ఎప్పుడో ఒకప్పుడు దయ కలుగుతుందనే నమ్మకంతో అమ్మలక్కలు భజనలు మానలేదు.

ఆ వారంలో శుక్రవారపు భజనలో సుబ్బమ్మగారింట్లో పైనుంచి కర్పూరం పడ్డదని ఒక పుకారు పుట్టింది. అంతా చెప్పుకొని సంతోషించారు. ఆవిడను మహాపుణ్యాత్మురాలన్నారు.

ఆరోజునుంచీ, ఆవిడ ఆ భక్తురాలుకు ఆప్తురాలైంది. వాళ్ళిద్దరూ ఒకదగ్గరే కూర్చుని భజనచేయడం, ఒకేసారి తన్మయత్వంలోకి పోవటం ఒకేమారు ఉలిక్కిపడటం మొదలెట్టారు.

వాళ్ళను చూచి ఇతరులు "అయ్యో మనమెంతపాపులమో, మన తపస్సు ఇంకా ఫలించలేదు కాబోలు!" అని విచారపడ్డారు. కాని ఎవ్వరూ నిరుత్సాహపడలేదు. అందరి ఇళ్ళల్లోనూ శుక్రవారం శుక్రవారం, భజనలు జరుగుతూనే ఉన్నాయి. మనవాడు (భక్తురాలి భర్త) లంక పొగాకుచుట్ట బాగా రూళ్ళకర్రంత లావుపాటిది వాకిట్లో కూర్చుని తగలేస్తునే ఉన్నాడు.

3

సుబ్బమ్మగారింట్లో పడ్డతరువాత వారంరోజులకు వెంకమ్మగారింట్లోను, తరువాత వరుసగా అన్నమ్మ గారింట్లోనూ,

అంజాన్యగారింట్లోనూ ఆరగింపులైనాయని పుకారు పుట్టింది. ఇవ్వాళ మా ఇంట్లో ఆరగింపు అయిందంటే ఇవ్వాళ మా ఇంట్లో అయిందని భజనపరులంతా ఒకరితో ఒకరు చెప్పుకొని సంతోషించారు.

ఈ స్థితిలో మా ఆవిడ కూడా భజనచేస్తానన్నది. నేనన్నానూ; "మనమెందుకు చేయడం. మనం పుణ్యాత్ములమని నాకేం నమ్మకం లేదు. ఆ సాయినాథ బాబు మనఇంటికి కూడా వచ్చి ఫలహారాలు ఆరగిస్తే సరేసరి, లేకపోతేనో, అంతా మనలని పాపిష్టివాళ్ళని అనుకోవచ్చు వద్దుసుమా" అని అంటే, బుర్రకెక్కితేగా మా ఆవిడకూ, "అయ్యో అందరింట్లోనూ, ఆరగిస్తున్నాడండీ మనకర్మం ఏం గాలింది? రంకుముండ నాగాముకంటే మనం తీసిపోయినామా అత్తలకు కోడళ్ళకు తెంపులుపెట్టి, కొంపలుతీసే నాకాసి రంగమ్మకంటే తీసిపోయినామా! మన నెందుకు బాబా అనుగ్రహించడో చూస్తా" నన్నది. ఒకరికి ఎప్పుడూ, అపకారం తలపెట్టక గుట్టుచప్పుడుగా కాపురంచేస్తున్న మాయందు ఆయనకు ఎందుకు అనుగ్రహం కలుగదని నాకూ నమ్మకం కలిగి సరేనన్నాను. మా పిల్లలు కూడా సరదా పడ్డారు.

సరే మర్నాడే మా ఆవిడ భజన ప్రారంభించింది. మొదటిరోజున, ఆ భక్తురాలు పాపం పని వేళా వచ్చి ఆ తంతు అంతా నేర్పింది మా ఆవిడకు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఈవిడ భజన చేసింది. మా ఇంట్లో వాళ్ళూ,

అద్దెకున్న వాళ్ళూ్ళ ముసలీ ముతకా, అంతా ఇరవై మంది చేరే వాళ్లు శుక్రవారం శుక్రవారం.

ప్రతిశుక్రవారం సాయంత్రం నేను ఇంటికి వడివడిగా నడిచి వచ్చి, ఆఁ ఏమిటి ? ఏమైంది ? ఏమున్నా. పడ్డదా అని ఆదుర్దాగా అడుగుతుండేవాడిని. మా ఆవిడ, "అయ్యో అయ్యో మనబోటివాళ్ళకే, అంత అదృష్టం. ఈ ముఖాలుచూసే ఆయన ఆరగించడం" అని ముక్కుమూలిగేది. హరినాథబాబు ఆరగించక పోవటానికి పూర్తిగా కాకపోయినా, చాలవరకు నేనే కారణభూతమైనట్లు ఆమె మాట్లాడేది. నేనేపాపం ఎరగను గదా నిజానికీ. అయితే ఏమిటి ? ఆవిడతోకలిసి, స్నాలు అయినా మానేసి నేనుకూడా భజనచేయటేదనీ, హరనాథ్ బాబా యందు పూర్తియైన నమ్మకం నాకు లేదనీ ఆవిడకు నాయందు కోపం.

"పోనీ నాముఖం చూసి రాకపోతే నీముఖం చూసి అయినా రాకూడదా" అన్నాను ఒకరోజున నేను విసుగెత్తి. "అసకాక మొగుడు చేసిన పాపం పెళ్ళాన్ని అంటదనీ, పుణ్యంలో మాత్రం సగభాగం పంచుకొంటుందనీ, పెద్దలు అంటారు కాబట్టి నాతోనూ, నా మొఖంతోనూ, నీ భజనకు ఏమీ సంబంధంలేదు. నమ్మకంతో నీవు సాగించు" మని హితం చెప్పాను.

అందరిళ్ళల్లోనూ వారం వారం భజన చేస్తున్నప్పుడల్లా అయన ఆరగింపుచేసి పోతున్నాడని, అందరూ అనటం ఈవిడ

ఒక్కక్తే ఇల్లాగ కేటాయింపు అయిపోవటం మూలాన ఆడ వాళ్ళల్లో మా ఆవిడకు కొంచెం చిన్నతనం అయింది. అంద రిళ్ళల్లోను అయిపోవాలన జొరబడ్డ బాబా పదో వారమైనా మా ఇంటికి రాలేదు. ఆ ఆచూకీ లేదు.

"పాపపరిహారం కావాలె. సంచితం నశించాలె. ఆయనకు దయగలగాలె" అని వాళ్ళూ, వీళ్ళూ అనడంవల్ల కూడా మా ఆవిడకు మరీ కష్టంవేసింది. వాళ్ళంతా మహాపవిత్రులైనట్లూ, ఆవిడమాత్రం పతిత అయినట్లూ ! ! కాని భజనమాత్రం మా ఆవిడ ఆపలేదు.

మా ఇంటికి బాబా ఆగమింపుకు రాని కారణాన స్త్రీలంతా, ఇక్కడికి రాక ఆ సుబ్బమ్మగారింటికీ ఆండాళ్ళగారింటికీ వెళ్ళడం సాగించారు. ఇంట్లో అద్దెకున్నవాళ్ళూ, మాపిల్లలూనూ ఆవిడా, పనిచేసేది, ఇంకా ఎవరైనా ఒకరిద్దరుమాత్రం భజనకు కూర్చుంటూ ఉండేవాళ్ళు.

సరిగ్గా పదకొండో వారంరోజున, నేను ఇంటికి వచ్చే రావడంతోనే పిల్లలంతా ఒక్కసారి గొల్లుమని గోలచేసి, నవ్వుతూ, ఎగురుతూ నాచుట్టూ చేరారు. వాళ్ళ వెనకాల భర్తను స్వశక్తిచేత బ్రతికించుకొన్న సావిత్రిలాగా ఆవిడ నిలుచున్నది. పైకి నవ్వుతున్నా కళ్ళల్లో ఎక్కడో వెనకాల కొద్దిగా విచారరేఖలున్నాయి.

ఏమిటీ ఇంతకూ, హరనాథబాబు కరుణించి మా ఇంట్లో కూడా అడుగుపెట్టాడట ! కాని పండు ఫలమూ ఇటువంటివి

ఆరగించక వెండిగిన్నె ఎత్తుకు పోయినాడని చెప్పేసరికి నాకుండా గుభేలు మన్నది.

ఏ వెండిగిన్నె అని నేనడగలేదు. అడగవలసిన అవసరమూ లేదు. మా ఇంట్లో ఉన్నది ఒక్కటే వెండిగిన్నె. నా పసి బాసికను చేయించిన మరక్కగిన్నె, యాభై అరవై తులాల బరువు, నలభై రూపాయలదాకా ఖరీదు అయింది. ఆ ఒక్క గిన్నె పోయిందనేసరికి, కష్టం వేసింది.

ఏమనటానికి తోచలేదు. హరినాథబాబు మమ్మల్ని కూడా గృహాన్ని పావనంచేశాడని సంతోషించేదా? మరక్కగిన్నె ఎత్తుకెళ్ళాడని దుఃఖించేదా?

"వెండిగిన్నె ఎందుకు ఎత్తుకెడతాడు? ఎక్కడయినా ఉందేమో చూడండి" అన్నాను.

"మీకింకా నమ్మకంలేదన్నమాట" అంటూ ఎత్తుకొంది మాఆవిడ. "అందులో పాలుపోసి ఇక్కడ పెట్టానండీ. పెట్టింది నేనూ. ఇక్కడే కూర్చున్నాను. భజన చేస్తూ, చేస్తూ, ఆర గించాడేమో హరనాథబాబు అని కళ్ళుతెరచి చూసేసరికి ఆగిన్నె లేదూ పాలూ లేవు. ఇది తప్పకుండా బాబా మహత్యమే" అంది.

"అయినా వెదకండి" అన్నాను.

"ఎందుకూ వెదకటం" అనిమాట తోసేసింది ఆ ఇల్లాలు ఈసడింపుతో.

"హరనాథబాబు పాలుతాగేసి గిన్నె ఎక్కడైనా పారేసి

పోయివుండకూడదూ" అన్నాను నేను. ఈ మాట కొంచెం సమంజసంగా కనపడ్డది కాబోలు ఆవిడా, పిల్లలూ ఒక ఘంట సేపు ఇల్లంతా వెతికారు. ఎక్కడా గిన్నె కనపడలేదు.

నేను కొంచెం విచారంగా ఉండటం మా మనిషికి బొత్తిగా ఇష్టంలేకపోయింది. పోతే పోయిందండీ భగవదర్పణ అయిన విషయంలో మనం బెంగపెట్టుకోకూడదు. గుళ్లు గోపురాలు కట్టించేవాళ్ళు కట్టిస్తూ వుండగా, భగవంతుడికి మనమొక వెండి గిన్నె సమర్పించుకోలేమా. ఆయనకే కరుణ కలిగితే మనకు ఐశ్వర్యం రాదా అన్నది.

౪

రోజులు గడిచిపోయినవి. మా కేవిధమైన ఐశ్వర్యమూ రాలేదు. తరువాత రెండు వారాలు ఏ ఆరగింపూ లేదు. "ఇక్కడ పెట్టిన వస్తువులలో నీకు ఇష్టమైంది పండో, ఫలమో, పానకమో, పాలో, తీసికొనిపో స్వామీ. వెండి గిన్నెలూ, అవీ మట్టుకు ఎత్తుకుపోకు. ఇదివరలో తీసుకుని వెళ్ళిపోయిందికూడా, ఎట్లా తీసికొని వెళ్లావో అట్లాగే గప్ చుప్ గా ఇచ్చేసెయ్యి" అని భజనసమయంలో ప్రార్థించమనీ కళ్ళు తెరిచివుంచే ప్రార్థన చేయమనీ, నేను మాయింటి ఆవిడకు సలహా చెప్పాను. కాని ఆవిడగారి మతం ఆవిడదీ. నా సలహా అంగీకరించి ఆచరించిందని నాకు నమ్మకం లేదు.

ఎందుచేత నంటారా, ఆ వెండిగిన్నె పోయిన తరువాత మూడో శుక్రవారంనాడు గుండుకంచుచెంబు హరనాథ బాబు ఎత్తుకొనిపోయినాడు. అందులో పానకంపోసి అక్కడ పెట్టిందట. కళ్ళు తెరిచి చూచేసరికి గుండుచెంబూ పానకమూ, విచిత్రంగా మాయమైనవి.

ఈమాటుమాత్రం మాఆవిడ కొద్దిగా విచార పడ్డట్టు స్పష్టంగా కనిపించింది. కాని హరనాథ్ బాబూ ఎత్తుకెళుతున్నాడని ఆవిడ కింకా గట్టినమ్మకం.

నాకుమట్టుకు చాలా కోపంవచ్చింది. "నీవు ఇంకా భజనలు సాగిస్తావా ? ఆపేస్తావా ? "అన్నాను.

మరి మధ్యలో ఆపేయటం ఎల్లాగ ? మన వస్తువులు మనకు ఇచ్చేసేదాకాఅన్న భజనచేయవద్దా" అన్నది నవ్వుతూ.

నేను గట్టిగా నోరు జేసుకోవాలసి వచ్చింది. "ఇదుగో చూడూ; కాంతం నేను చెప్పేమాటలు వినకపోతివా ఇక మన సంసారం గుల్లఅయిపోతుంది. ఈహరనాథ బాబు భజన వద్దని మొదట్లోనే నేచెప్పాను. ఏవో పండూ; పాలూ, ఎత్తుకొనిపోయి తింటే నాకేమీ అభ్యంతరం లేదు. వెండిగిన్నెలు గుండు చెంబులు ఎత్తుకొనిపోవటం నాకేమాత్రం ఇష్టంలేదు. వారానికి ఓ వస్తువచొప్పున ఇంట్లో చెంబులూ తప్పాలాలూ ఎత్తుకెళ్ళు తుంటే మనగతి ఏం కావాలె ? అందిందిగదా అని ఇవ్వాళ వెండి గిన్నె ఎత్తుకొని వెళ్ళాడు ; రేపు నీ మెళ్ళో కాశీగుండ్లు కొస్తా తెంచుకొని పోతే నేనెవ్వరితో చెప్పుకొని ఏడ్చేది? కాబట్టి..."

"పాపంమాటలు అనకండి. పిల్లలు గలవాళ్ళము" అంది ఆవిడ.

"పాపంమాటలు నేనేం అనటంలేదు. ఆయన మహానుభావు కావచ్చు. కాని ఈపద్ధతిమీద అయితేమట్టుకు ఆయన మనకొంపకు రావటం నాకు సనేమిరా ఇష్టంలేదు. మనవి మనకు ఇచ్చేసి, ఇక ఈ కొంపకేసి తిరిగి చూడవద్దని ఆయనను ప్రార్థనచెయ్యి" అన్నాను.

ఈమాటలు విని దేవుణ్ణి దూషించానని ఆఇల్లాలు చిన్నపుచ్చున్నది. నేను ఇంత కఠినంగామాట్లాడటం మూలాన్నో, మా ఆవిడ నాగోల పడలేక భజనలు మానివేయటం మూలంగా కోపంవచ్చో, కాని హరనాథ్ బాబూ మళ్ళీఏమీఎత్తుకెళ్ళలేదు. అయితే ఇదివరలో ఎత్తుకెళ్ళినవి తెచ్చి ఇవ్వనూలేదు. "భజనలు మానేసినట్లేనా" అన్నాను చాలా కాలమైన తరవాత ఒక రోజు. "మనస్సులో అనుకోకుండా, మీరాజ్ఞ పెడతారా" అంది ఆ పెంకెమనిషి.

ఆవిడ హృదయం మాత్రం హరినాథబాబాకు అంకితమై పోయింది. నా ఒత్తిడిపడలేక, ఈ పాపిని సంతోషపెట్టటానికి భజనలు మానిందేకాని ఆమె హృదయపాత్ర భక్తితో నిండి ఉన్న సంగతి నేను తెలుసుకోలేదు.